ప్రపంచ యుద్ధం దిశగా?

- రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణులతో ఉక్రెయిన్ దాడి
- అమెరికా అధ్యక్షుడు బైడెన్ అనుమతితో దూకుడు
- స్పందనగా అణు విధానాన్ని మార్చుకున్న రష్యా
- ఉక్రెయిన్‌పై అణుదాడికి వెనుకాడబోమని సంకేతం
- తమపై ఉమ్మడి దాడిగా పరిగణిస్తామని ప్రకటన
- ఇతర దేశాలకు విస్తరించనున్న ఇరు దేశాల సంక్షోభం

మాస్కో, నవంబర్ 19: రష్యా- ఉక్రెయిన్ యుద్ధం మరింత ముదురుతున్నది. ఇప్పటివరకు రెండు దేశాల మధ్య నడిచిన యుద్ధం ఇప్పుడు ఇతర దేశాలకు విస్తరించే ప్రమాదం కనిపిస్తున్నది. అమెరికా సహా నాటో దేశాలు సైతం అనివార్యంగా యుద్ధంలో భాగమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో మూడో ప్రపంచ యుద్ధం ముంచుకొస్తున్నదనే భయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రష్యాలోని సుదూర ప్రాంతాలపై దాడికి అమెరికా సరఫరా చేసిన దీర్ఘ శ్రేణి క్షిపణులు వినియోగించేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అనుమతివ్వడం ఉద్రిక్తతలను ఒక్కసారిగా పెంచేసింది.

దూకుడు మీదున్న ఉక్రెయిన్

చాలా కాలంగా కోరుతున్న అనుమతి లభించడంతో ఉక్రెయిన్ దూకుడుగా వ్యవహరిస్తున్నది. అమెరికాలానే తాము సరఫరా చేసిన స్టార్మ్ షాడో క్షిపణుల వినియోగానికి యూకే, స్కాల్ప్ క్షిపణుల వినియోగానికి ఫ్రాన్స్ కూడా ఉక్రెయిన్‌కు అనుమతి ఇవ్వనున్నట్టు తెలుస్తున్నది. 'దాడులు మాటల్లో జరగవు. క్షిపణులే మాట్లాడతాయి. 2025లో యుద్ధ విజేత ఎవరో ప్రపంచం చూస్తుంది' అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. ఇందుకు తగ్గట్టుగానే మంగళవారం తమ దేశంలోని బ్రయాన్స్క్ ప్రాంతంపై ఆరు ఏటీఏసీఎం క్షిపణులతో ఉక్రెయిన్ దాడి చేసిందని, వాటిని కూల్చేశామని రష్యా రక్షణ శాఖ ప్రకటించింది.

రష్యా అణుదాడి హెచ్చరిక

రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణుల వినియోగానికి అనుమతిస్తే తమ అణు విధానాన్ని మార్చుకుంటామని, తమపై దాడిని ఉమ్మడి దాడిగా భావిస్తామని ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరిస్తూ వచ్చారు. ఇప్పుడు అమెరికా అనుమతి వ్వడాన్ని రష్యా తీవ్రంగా పరిగణించింది. ఉక్రెయిన్‌పై అణుదాడి చేసేందుకు వీలుగా తన అణు విధానాన్ని మార్చుకుంది. ఈ మేరకు తయారుచేసిన కీలక ఉత్తర్వుపై ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మంగళవారం సంతకం చేశారు. ఏదైనా దేశం వద్ద అణ్వాయుధాలు లేకపోయినప్పటికీ అణ్వాయుధాలు కలిగిన దేశాల మద్దతుతో తమ దేశంపై దాడి చేస్తే, తమ దేశం అణ్వాయుధాలతో దాడి చేసేందుకు ఈ ఉత్తర్వు అనుమతి ఇస్తున్నది. దీంతో ఉక్రెయిన్‌పై అణుదాడికి వెనుకాడబోమని రష్యా పరోక్షంగా హెచ్చరించినట్టు అయ్యింది.

మూడో ప్రపంచ యుద్ధం దిశగా?

ఏదైనా అణ్వాయుధ దేశం మద్దతుతో తమ దేశంపై దాడి జరిగితే, దానిని ఉమ్మడి దాడిగా భావిస్తామని సైతం రష్యా తన అణువిధానంలో చేర్చింది. తద్వారా ఉక్రెయిన్‌కు మద్దతు ఇస్తున్న నాటో దేశాలకు సైతం రష్యా హెచ్చరిక జారీ చేసినట్టు అయ్యింది. దీంతో యుద్ధంలోకి నాటో దేశాలు కూడా చేరే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇదే జరిగితే మూడో ప్రపంచ యుద్ధం ముప్పు ముంచుకొస్తున్నట్టే ననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'శాంతిస్థాపనకు, ప్రాణాలు కాపాడేందుకు మా నాన్నకు అవకాశం రావడానికి ముందే మూడో ప్రపంచ యుద్ధం కావాలని ఆయుధ పరిశ్రమ కోరుకుంటున్నట్టు ఉంది' అని అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు ట్రంప్ జూనియర్ వ్యాఖ్యానించడం పరిస్థితికి అద్దం పడుతున్నది. బైడెన్ నిర్ణయం మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందని రష్యా కూడా పేర్కొన్నది.

1000వ రోజుకు చేరుకున్న రష్యా - ఉక్రెయిన్ యుద్ధం

రష్యా - ఉక్రెయిన్ యుద్ధం మంగళవారానికి వెయ్యి రోజులకు చేరుకున్నది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో నెలకొన్న అతిపెద్ద సంక్షోభం ఇది. ఈ యుద్ధంలో తమ 80 వేల మంది సైనికులు మరణించారని, నాలుగు లక్షల మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అంచనా వేస్తున్నది. ఉక్రెయిన్‌లో ఆగస్టు 31 నాటికే 11,743 మంది సాధారణ ప్రజలు మరణించారని, 24,614 మంది గాయపడ్డారని ఐరాస పేర్కొన్నది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఉక్రెయిన్‌లో కోటి మంది జనాభా తగ్గిందని తేల్చింది. ఉక్రెయిన్ పునరుద్ధరణకు రూ.41 లక్షల కోట్లు కావాలని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. ఉక్రెయిన్ భూభాగంలో ఐదో వంతును రష్యా ఆక్రమించింది. యుద్ధాన్ని రష్యానే ప్రారంభించినప్పటికీ ఆ దేశం కూడా భారీగానే నష్టాన్ని చవిచూసిందని పాశ్చాత్య దేశాల నిఘా వర్గాలు చెప్తున్నాయి. రష్యా సైనికులు రెండు లక్షల మంది మరణించారని, నాలుగు లక్షల మంది గాయపడ్డారని అంచనా వేస్తున్నాయి.

వచ్చే ఏడాది భారత పర్యటనకు పుతిన్

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉన్నట్టు దౌత్యవర్గాలు మంగళవారం తెలిపాయి. జూలైలో మాస్కోలో జరిగిన చర్చల సమయంలో భారత్‌లో పర్యటించాల్సిందిగా పుతిన్‌ను ప్రధాని మోదీ ఆహ్వానించారు. మంగళవారం భారతీయ ఎడిటర్లతో వీడియో సమావేశంలో క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమ్మిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ.. ఇరు దేశాల మధ్య బలమైన ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయని, త్వరలో పుతిన్ భారత్‌లో పర్యటించవచ్చని చెప్పారు. అయితే, నిర్దిష్ట తేదీలను మాత్రం ప్రకటించలేదు.

'ఓపెన్ బుక్ పరీక్ష' వదంతులు నమ్మొద్దు

పరీక్షా విధానం, సిలబస్‌లో మార్పుల్లేవ్: సీబీఎస్‌ఈ

న్యూఢిల్లీ: పది, పన్నెండో తరగతుల పరీక్షా విధానంలో మార్పులు, సిలబస్ తగ్గింపు గురించి సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్ని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) ఖండించింది. సిలబస్‌ను 15 శాతం వరకు తగ్గిస్తున్నారని, 10, 12 తరగతుల పరీక్షలను 2025లో ఓపెన్ బుక్ విధానంలో నిర్వహిస్తారంటూ వచ్చిన వార్తలన్నీ పుకార్లేనని, వాటిని నమ్మొద్దని సీబీఎస్‌ఈ తెలిపింది. మంగళవారం ఈ మేరకు సీబీఎస్‌ఈ ప్రాంతీయ ఆఫీసర్ వికాస్‌కుమార్ అగర్వాల్ ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో వచ్చే పోస్టులను నమ్మొద్దని విద్యార్థులను కోరారు. సీబీఎస్‌ఈ అధికారిక వెబ్‌సైట్‌లోని సమాచారంపై మాత్రమే ఆధారపడాలని సూచించారు.

గుజరాత్‌లో నకిలీ మల్టీ స్పెషాలిటీ దవాఖాన

సూరత్, నవంబర్ 19: ఫేక్ టోల్ ప్లాజా, ఫేక్ బ్యాంకు, ఫేక్ పోలీస్ స్టేషన్ తర్వాత గుజరాత్‌లో ఫేక్ మల్టీ స్పెషాలిటీ దవాఖాన వెలుగులోకి వచ్చింది. సూరత్‌లో ఒక మల్టీ స్పెషాల్టీ దవాఖానను కొందరు వైద్యుల బృందం ఆదివారం అట్టహాసంగా ప్రారంభించింది. దవాఖాన ప్రారంభోత్సవ ఆహ్వానంలో ప్రముఖుల పేర్లు ముద్రించారు. అయితే అది ప్రారంభమై 24 గంటలు కూడా కాకముందే దానిని అధికారులు సీజ్ చేశారు. ఇంత హడావిడిగా ప్రారంభించిన దవాఖానలోని డాక్టర్లలో ఎక్కువ మంది నకిలీలు కావడమే దానికి కారణం.

ఈ నెల చివరినాటికి 1,000 కొత్త జనరల్ బోగీలు: రైల్వే

న్యూఢిల్లీ: 370 రైళ్లలో 1,000కిపైగా కొత్త జనరల్ బోగీలను అమర్చబోతున్నట్టు రైల్వే బోర్డ్ ప్రకటించింది. పలు రైళ్లలో ఇప్పటికే 583 జనరల్ కోచ్‌లను అమర్చగా, ఈ నెలఖరు నాటికి మిగిలిన రైళ్లకు అమర్చే ప్రక్రియ పూర్తవుతుందని తెలిపింది. 8 లక్షల మంది ప్రయాణికుల రాకపోకల కోసం రాబోయే రెండేండ్లలో కొత్తవి 10 వేల బోగీలను ప్రవేశపెడుతున్నట్టు పేర్కొన్నది.



అమ్మకానికి హిమాచల్ భవన్!

- విద్యుత్తు సంస్థకు బకాయిలు చెల్లించని కాంగ్రెస్ సర్కారు
- రికవరీ కోసం ఢిల్లీలోని హిమాచల్ భవన్ జప్తుకు రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు
- సుఖు సర్కారుకు భంగపాటు

సిమ్లా, నవంబర్ 19: గ్యారెంటీల పేరుతో గద్దెనెక్కి రాష్ట్రాన్ని దివాలా తీయించిన హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ సర్కారుకు మరో భంగపాటు ఎదురైంది. ఓ విద్యుత్తు సంస్థకు చెల్లించాల్సిన రూ.150 కోట్లను రికవరీ చేసేందుకు ఢిల్లీలోని హిమాచల్ భవన్ జప్తుకు హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ భవనాన్ని వేలం వేసి బకాయిలు తీర్చేసుకోవాలని సదరు కంపెనీకి సూచించింది. ఈ తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. పది గ్యారెంటీల పేరుతో రెండేండ్ల క్రితం హిమాచల్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. రాష్ట్రాన్ని దివాలా తీయించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడం, ఉద్యోగులకు వేళకు జీతాలు ఇవ్వకపోవడం, ప్రజలపై టాయిలెట్ ట్యాక్స్ విధింపు వంటి నిర్ణయాలు తీసుకోవడంతో సుఖ్వీందర్ సింగ్ సుఖు సర్కారుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇప్పుడు హిమాచల్ భవన్ జప్తు కావడం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సర్కారును అప్రతిష్ఠపాలు చేసింది. కోర్టు ఆదేశించిన డబ్బు చెల్లించని ప్రభుత్వం చీనాబ్ నదిపై 340 మెగావాట్ల సెలీ హైడ్రోపవర్ ప్రాజెక్టును 2009లో సెలీ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీకి హిమాచల్ ప్రభుత్వం అప్పగించింది. ఇందుకు గానూ రూ.64 కోట్లను ఈ సంస్థ ప్రభుత్వానికి ముందస్తు ప్రీమియంగా చెల్లించింది. ఆ తర్వాత ఈ ప్రాజెక్టును ప్రభుత్వం రద్దు చేసినా, ప్రీమియం డబ్బును మాత్రం సంస్థకు చెల్లించలేదు. దీనిపై ఈ సంస్థ హైకోర్టును ఆశ్రయించగా.. వడ్డీతో సహా డబ్బు చెల్లించాలని 2023 జనవరి 13న ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో వడ్డీతో కలిపి చెల్లించాల్సిన బకాయి రూ.150 కోట్లకు చేరింది. కోర్టు ఆదేశించినా హిమాచల్ సర్కారు డబ్బులు కట్టలేదు. దీంతో మరోసారి ఈ సంస్థ హైకోర్టును ఆశ్రయించగా.. ఢిల్లీలోని మండి హౌజ్ ప్రాంతంలో ఉన్న హిమాచల్ భవన్‌ను అటాచ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భవనాన్ని వేలం వేసి, బకాయిలు తీసుకోవాలని సదరు సంస్థకు సూచించింది.

ప్రభుత్వానికి నల్ల మచ్చ: బీజేపీ

హైకోర్టు తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ మండిపడింది. హిమాచల్ భవన్ లాంటి ప్రధానమైన ఆస్తిని అటాచ్ చేయడం రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి అని ప్రతిపక్ష నేత జైరాం ఠాకూర్ విమర్శించారు. రెండేండ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తున్నదని ఆయన దుయ్యబట్టారు.

హిందీలో ఎల్ఐసీ వెబ్‌సైట్

భగ్గుమన్న తమిళ పార్టీలు • దెబ్బకు దిగొచ్చిన బీమా సంస్థ

చెన్నై, నవంబర్ 19: భారత జీవన బీమా సంస్థ (ఎల్ఐసీ) మంగళవారం వివాదానికి కేంద్ర బిందువైంది. దాని అధికారిక వెబ్‌సైట్‌ను ఇంగ్లిష్‌లో కాకుండా పూర్తిగా హిందీలోకి మార్చడంపై తమిళనాడులోని రాజకీయ పార్టీలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. బలవంతంగా హిందీని రుద్దుతున్నారంటూ మండిపడ్డాయి. ఎల్ఐసీ ఇటీవలే తన అధికారిక వెబ్‌సైట్‌ను ఆధునీకరించింది. దాని హోం పేజ్ మొత్తాన్ని హిందీలోకి మార్చేశారు. భాషను ఇంగ్లిష్‌లోకి మార్చుకొనే ఆప్షన్ సైతం హిందీలోనే కనిపించింది. దీనిపై తమిళపార్టీలు భగ్గుమన్నాయి. హిందీని తమపై బలవంతంగా రుద్దడానికి ఎల్ఐసీని ఒక ప్రచారాస్త్రంగా మార్చుకున్నారని సీఎం స్టాలిన్ మండిపడ్డారు. సంస్కృతిని, భాషను బలవంతంగా ప్రయోగించాలనుకోవడం దేశ వైవిధ్యాన్ని తుంగలో తొక్కడమేనని వ్యాఖ్యానించారు. దీనిపై ఎల్ఐసీ వివరణ ఇస్తూ, కేవలం సాంకేతిక కారణాల వల్ల హోం పేజ్ హిందీలోకి మారిందని తెలిపింది.

ఆహారం, మందులు నిల్వ చేసుకోండి

- అణు యుద్ధం వచ్చే అవకాశం
- ప్రజలను సిద్ధం చేస్తున్న ఐరోపా దేశాలు

స్టాక్‌హోమ్, నవంబర్ 19: 'అణుయుద్ధం వచ్చే అవకాశం ఉన్నది. సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి' అంటూ తమ పౌరులను ఐరోపా దేశాలు అప్రమత్తం చేస్తున్నాయి. రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణులతో దాడి చేసేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అనుమతించడం, దీనిని స్పందన తమ అణువిధానాన్ని రష్యా మార్చుకోవడంతో ఐరోపాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో యుద్ధమే సంభవిస్తే ఎలా వ్యవహరించాలి, ఏం చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి అంశాలను స్వీడన్, ఫిన్‌లాండ్, నార్వే, డెన్మార్క్ వంటి దేశాలు ప్రజలకు వివరిస్తున్నాయి. ఈ మేరకు స్వీడన్, నార్వే పాంప్లెట్లను పంపిణీ చేస్తుండగా, ఫిన్‌లాండ్ ఒక ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసింది. అణు దాడి సహా అత్యవసర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున నిత్యావసర వస్తువులు, మంచినీరు, ఔషధాలను నిల్వ చేసుకోవాలని ప్రజలను స్వీడన్ కోరింది. అయోడిన్ ట్యాబ్లెట్లు, సులువుగా వండుకునే ఆహారం, పెంపుడు జంతువులకు ఆహారం నిల్వ చేసుకోవాలని, బ్యాకప్ విద్యుత్తు సదుపాయం ఏర్పాటు చేసుకోవాలని ఫిన్‌లాండ్ సూచించింది. ఆలుగడ్డలు, క్యాబేజ్, క్యారెట్, గుడ్లు వంటి నిత్యావసర వస్తువులను నిల్వ చేసుకోవాలని ప్రజలను స్వీడన్ కోరింది.

నేడు 'మహా' ఎన్నికల సమరం

288 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ • జార్ఖండ్ ఆఖరి విడత ఎన్నికలు నేడే

ముంబై, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 288 నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ జరగనుంది. ఎన్నికల్లో విజయం కోసం అధికార మహాయుతి కూటమి, విపక్ష మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) హోరాహోరీ తలపడుతున్నాయి. మహాయుతి కూటమి తరపున బీజేపీ 149 స్థానాల్లో, శివసేన 81 స్థానాల్లో, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ 59 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఎంవీఏ తరపున కాంగ్రెస్ 101 స్థానాల్లో, శివసేన(యూబీటీ) 95 స్థానాల్లో, ఎన్సీపీ(ఎస్పీ) 86 స్థానాల్లో బరిలో ఉన్నాయి. పోలింగ్‌కు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. 9.70 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరి కోసం 1,00,186 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నవంబరు 23న ఎన్నికల కౌంటింగ్ జరగనుంది.

నేడు జార్ఖండ్ ఆఖరి విడత ఎన్నికలు

జార్ఖండ్‌లో బుధవారం జరిగే రెండో, ఆఖరి విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం 81 అసెంబ్లీ స్థానాల్లో 38 సీట్లకు జరిగే ఈ ఎన్నికల్లో సీఎం హేమంత్ సొరేన్, ఆయన భార్య కల్పనా సొరేన్, విపక్ష బీజేపీ నేత అమర్ కుమార్ బౌరీ సహా 528 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

బీజేపీ ఓటుకు నోటు?!

- ఆ పార్టీ నేతను 5 కోట్లతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న బీవీఏ!
- ఆ నగదు తనది కాదన్న వినోద్

వినోద్‌ను చుట్టిముట్టి డబ్బు గురించి ప్రశ్నిస్తున్న బీవీఏ కార్యకర్తలు

ముంబై, నవంబర్ 19: మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికల పోలింగ్ ముందురోజు హైడ్రామా చోటు చేసుకుంది. పాల్ఘర్‌లో ఓటర్లను ప్రభావితం చేయడానికి బీజేపీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే డబ్బులు పంచుతున్నారని బహుజన్ వికాస్ అఘాడీ(బీవీఏ) కార్యకర్తలు ఆరోపించారు. ఈ ఆరోపణలను తావ్డే తిరస్కరించగా, ఎన్నికల సంఘం ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. పాల్ఘర్‌లోని ఓ హోటల్‌లో మంగళవారం తావ్డే నలసోపారా నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రాజన్ నాయక్‌తో సమావేశమై ఉన్నప్పుడు బీవీఏ కార్యకర్తలు అక్కడికి దూసుకొచ్చారు. అక్కడ తావ్డే రూ.5 కోట్ల నగదుతో రెడ్ హ్యాండెడ్‌గా తమకు పట్టుబడ్డారని వారు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అయింది. ఆ వీడియోలో బీవీఏ కార్యకర్తలు ఒక సంచిలోని నోట్ల కట్టల గురించి మాట్లాడుతుండగా, అవి తనవి కావని తావ్డే చెప్పడం వీడియోలో కనిపించింది. బీవీఏ అధ్యక్షుడు, వసాయ్ ఎమ్మెల్యే హితేంద్ర ఠాకూర్‌కు పాల్ఘర్ జిల్లాలో గట్టి పట్టు ఉంది. మహారాష్ట్ర ఎన్నికల్లో ఆయన వసాయ్ నుంచి, ఆయన కుమారుడు క్షితిజ్ నలసోపారా నుంచి పోటీ చేస్తున్నారు. సంచి నుంచి రెండు డైరీలను కూడా రికవరీ చేసినట్టు హితేంద్ర ఠాకూర్ ఆరోపించారు. తావ్డేను వెంటనే అరెస్ట్ చేయాలని బీవీఏ కార్యకర్తలు డిమాండ్ చేశారు. పోలీసులు హోటల్‌ను సీజ్ చేసి, తావ్డేను బయటకు తీసుకు రావడానికి ప్రయత్నించారు. తావ్డే ఘటనపై విపక్షాలు తీవ్రంగా ధ్వజమెత్తాయి.

సంక్షోభంలో బీరేన్ సర్కార్

- మణిపూర్ బీజేపీ ప్రభుత్వానికి డేంజర్ బెల్స్
- ఎన్డీయే భేటీకి 25 మంది ఎమ్మెల్యేల గైర్హాజరు
- బీరేన్ సింగ్‌ను తప్పించాలని పెరుగుతున్న డిమాండ్

ఇంఫాల్, నవంబర్ 19: గత ఏడాదిన్నరగా మణిపూర్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు, సంక్షోభం కొనసాగుతున్న క్రమంలో బీజేపీ నేతృత్వంలోని ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రభుత్వానికి డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ఒక పక్క సొంత పార్టీ, కూటమి నేతలు ఆయనపై అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, కేంద్రం కూడా ఆయన పనితీరుపై ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది. రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న క్రమంలో సోమవారం బీరేన్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఎన్డీఏ సమావేశానికి 25 మందికి పైగా సభ్యులు గైర్హాజర్వడం చర్చనీయాంశంగా మారింది.

ఎన్‌పీపీ మద్దతు ఉపసంహరణతో మరింత సంక్షోభం

జిరిబామ్ జిల్లా ఉదంతంతో సీఎం బీరేన్ సింగ్ వైఫల్యాన్ని నిరసిస్తూ ఎన్డీఏ భాగస్వామిగా ఉన్న నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) తాము కూటమి నుంచి వైదొలగుతున్నట్టు ఆదివారం ప్రకటించింది. దీంతో కూటమి సంక్షోభంలో పడింది. బీరేన్ సింగ్‌ను అధికారంలోంచి తొలగిస్తే తమ పార్టీ మద్దతుపై పునరాలోచిస్తామని ఎన్‌పీపీ చీఫ్, మేఘాలయ ముఖ్యమంత్రి కన్రాడ్ కే సంగ్మా ప్రకటించారు. దీంతో ఆ పార్టీ ఏడుగురు సభ్యులు వైదొలగడంతో కూటమి బలం తగ్గింది. దీంతో అప్రమత్తమైన బీరేన్ సింగ్ సోమవారం రాత్రి హఠాత్తుగా తమ కూటమి సభ్యులను సమావేశపరిచారు. అయితే 11 మంది ఎమ్మెల్యేలు సమావేశానికి హాజరు కాలేదు.

కుకీ మిలిటెంట్లపై భారీ ఆపరేషన్ చేపట్టాలి

మణిపూర్‌లో తీవ్ర విధ్వంసానికి కారణమైన కుకీ మిలిటెంట్లపై భారీ ఆపరేషన్ నిర్వహించాలని అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి సమావేశమైన 27 మంది ఎమ్మెల్యేలు మహిళలు, చిన్నారుల మృతికి కారణమైన కుకీ మిలిటెంట్లపై భారీ ఆపరేషన్ నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కాగా, మణిపూర్‌లోని చురాచాంద్‌పూర్ జిల్లాలో ఖాళీ శవపేటికలతో కుకీలకు మద్దతుగా వందలాది మంది ప్రదర్శన నిర్వహించారు. మణిపూర్ సంక్షోభంపై జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంగళవారం విజ్ఞప్తి చేశారు.

కాలుష్య కట్టడికి కృత్రిమ వర్షమే శరణ్యం

కేంద్రం అనుమతి కోరిన ఢిల్లీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రెండో రోజు కూడా క్షీణించి కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకున్నది. కాలుష్య తీవ్రతను నిరోధించడానికి నగర వ్యాప్తంగా కృత్రిమ వర్షం కురిపించడమొక్కటే మార్గమని, ఇందుకు అనుమతించాలని ఢిల్లీ సర్కారు కేంద్రాన్ని కోరింది. సాధారణ జీవితాన్ని ప్రభావితం చేస్తున్న ఈ సంక్షోభంపై ప్రధాని జోక్యం చేసుకోవాలని అభ్యర్థించింది. నిన్నటి గాలి నాణ్యత సూచీ (490) స్థాయితో పోలిస్తే మంగళవారం 460తో స్వల్పంగా మెరుగుదల నమోదైనా ఇంకా ప్రమాదకర విభాగంలోనే ఉంది.

ఇంకా రాజధానిగా ఉండాలా?

ఢిల్లీలో కాలుష్యం తీవ్రస్థాయికి చేరుకున్నా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రంగా విమర్శించారు. నగరంలో విద్యాసంస్థలు మూతపడ్డాయని, రవాణా వ్యవస్థకు ఆటంకం ఏర్పడిందని, ప్రజలకు ఇదో పీడకలగా మారిందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఢిల్లీకి రాజధానిగా ఉండే యోగ్యత ఉందా? ఇదింకా రాజధానిగా కొసాగాలా? అని ఆయన ప్రశ్నించారు.

3 రోజులుగా ఎయిర్‌పోర్ట్‌లోనే నిరీక్షణ

ఎయిర్ ఇండియా ప్రయాణికులకు చేదు అనుభవం

పుకెట్, నవంబర్ 19: సాంకేతిక కారణాల వల్ల 80 గంటలకుపైగా నిలిచిపోయిన విమాన సర్వీస్ దాదాపు 100 మంది ఇండియా ప్రయాణికులకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. పలువురు ప్రయాణికులు తమ అవస్థను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ నెల 16న రాత్రి థాయ్‌లాండ్‌లోని పుకెట్ నుంచి విమానం ఢిల్లీకి బయలుదేరాల్సి ఉంది. అయితే సాంకేతిక తప్పిదం వల్ల విమానం ఆరు గంటలు ఆలస్యమవుతుందని ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు ప్రయాణికులకు తెలిపారు. అయితే అంతసేపు నిరీక్షించిన తర్వాత విమానం రద్దయిందని వెల్లడించారు. అయితే ఆ తర్వాత ఆ తప్పిదాన్ని సరిచేసి అదే విమానంలో ప్రయాణికులను ఎక్కించారు. కానీ రెండున్నర గంటల తర్వాత మళ్లీ సాంకేతిక సమస్య తలెత్తడంతో విమానం తిరిగి పుకెట్ విమానాశ్రయంలో దిగింది. విమానం ఆలస్యంపై ఎయిర్ ఇండియా ప్రతినిధులు మాట్లాడుతూ.. పైలెట్ల విధుల సమయ పరిమితి వల్ల ఈ నెల 16న విమానం ఎగురలేదన్నారు. 17న సాంకేతిక కారణాల వల్ల విమానం అత్యవసరంగా ల్యాండింగ్ అయ్యిందన్నారు.

కొలెస్ట్రాల్‌ను 86% మేరకు తగ్గించే పిల్



న్యూఢిల్లీ, నవంబర్ 19: గుండె జబ్బులు ఏటా ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ప్రాణాలను కబళిస్తున్నాయి. రక్తనాళాల్లో కొవ్వు (కొలెస్ట్రాల్) అధికంగా పేరుకుపోవడం ఈ జబ్బులకు ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో కొలెస్ట్రాల్‌ను గణనీయంగా తగ్గించే సరికొత్త పిల్‌ను అమెరికన్ బహుళజాతి ఔషధ సంస్థ 'ఎలీ లిల్లీ' ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేసింది. 'మువలాప్లిన్' అనే ఈ పిల్‌ను అధిక మోతాదులో ఉపయోగించడం ద్వారా కొలెస్ట్రాల్ 70 నుంచి 86 శాతం మేరకు తగ్గినట్టు పరీక్షల్లో తేలిందని సోమవారం షికాగోలో జరిగిన అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సమావేశంలో పరిశోధకులు వెల్లడించారు. అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడుతున్న రోగులకు చికిత్స అందించేందుకు ప్రస్తుతం పలు రకాల ఇంజెక్టబుల్ థెరపీలు అందుబాటులో ఉన్నప్పటికీ నోటి ద్వారా తీసుకోగలిగే ఏకైక ఔషధం 'మువలాప్లిన్' మాత్రమే. మిడ్-స్టేజ్ ట్రయల్స్‌లో పరిశోధకులు ఈ పిల్‌ను అధిక కొలెస్ట్రాల్ (లిపోప్రొటీన్-ఏ)తో బాధపడుతున్న 233 వయోజనులపై పరీక్షించారు. వారిలో కొందరికి 10 మిల్లీగ్రాములు, మరికొందరికి 60 మిల్లీగ్రాములు, ఇంకొందరికి 240 మిల్లీగ్రాముల డోసులు ఇచ్చారు. అనంతరం సంప్రదాయ, ఆధునిక పద్ధతులతో కూడిన రక్తపరీక్షల ద్వారా ఆ రోగుల్లోని కొలెస్ట్రాల్ స్థాయిలను పరిశీలించారు. 10 మిల్లీగ్రాముల డోసు తీసుకున్న రోగుల్లో 40.4 నుంచి 47.6 శాతం, 60 మిల్లీగ్రాముల డోసు తీసుకున్న రోగుల్లో 68.9 నుంచి 81.7 శాతం, 240 మిల్లీగ్రాముల డోసు తీసుకున్న రోగుల్లో 70 నుంచి 85.8 శాతం మేరకు కొలెస్ట్రాల్ తగ్గినట్టు ఈ పరీక్షల్లో తేలిందని పరిశోధకులు వెల్లడించారు.

జీశాట్-20 ప్రయోగం సక్సెస్

- స్పేస్‌ఎక్స్ సాయంతో నిర్ణీత కక్ష్యలోకి ఇస్రో ఉపగ్ర